క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 23న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ధర్మారం, కోటగండి సాయిబాబా దేవాలయం ప్రాంతాల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

లక్ష్మి మెరుగుకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం పరిశోధకురాలు లక్ష్మి మెరుగుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. సీజనల్ అబుండన్స్ ఆఫ్ సాయిల్ ఇన్హాబిటింగ్ ఆర్థ్రోపాడ్స్ ఇన్ ఫారెస్ట్ అండ్ ఆగ్రో ఎకోసిస్టమ్స్ ఇన్ వరంగల్ డిస్ట్రిక్ట్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి లక్ష్మి మెరుగుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. జువాలజీ విభాగం ప్రొఫెసర్ ఈసం నారాయణ పర్యవేక్షణలో లక్ష్మి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

కౌన్సిల్ సమావేశం నిర్వహించండి

వరంగల్ అర్బన్: వరంగల్ బల్దియా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించాలని బీఆర్ఎస్ కార్పొరేటర్లు కోరారు. ఈమేరకు బల్దియా కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు కార్పొరేటర్లు మరుపల్లి రవి, పల్లం పద్మ, మరో ముగ్గురు కార్పొరేటర్ల భర్తలు, బీఆర్ఎస్ నాయకులు బోగి సురేష్, రాజు, పల్లం రవి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8నెలలు గడుస్తున్నా కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయకపోవడం వల్ల డివిజన్లలో క్షేత్రస్థాయిలో సమస్యలు పేరుకుపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పారిశుద్ధ్య కార్మికుల బదిలీలు నిలిపివేయాలి



వరంగల్ అర్బన్: క్షేత్రస్థాయిలో డ్రెయినేజీలు, రోడ్లు ఊడ్చే బల్దియా పారిశుద్ధ్య కార్మికులు, జవాన్లు, అటెండర్ల బదిలీలను నిలిపివేయాలని పలు సంఘాలు కోరాయి. బదిలీ చేస్తే కార్మికులు అన్యాయనికి గురవుతారని టీఎంఆర్‌పీఎస్, టీఎంఈడబ్ల్యూఏ, జేఏసీ, ఏఐటీయూసీ సంఘాల పేరిట బల్దియా ప్రధాన కార్యాలయం గేట్‌కు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

స్లాబ్ పెచ్చులూడి మహిళకు గాయాలు



హన్మకొండ చౌరస్తా: ఇంటి స్లాబ్ పెచ్చులూడి పడి నిద్రిస్తున్న మహిళకు తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం అర్ధరాత్రి రెడ్డికాలనీలో చోటుచేసుకుంది. బాధితురాలు ఎర్రోజు అరుణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ 4వ డివిజన్ పరిధిలోని రెడ్డికాలనీకి ఇంటిలో నిద్రిస్తుండగా స్లాబ్ పెచ్చులూడి అరుణ పొట్ట, రెండు కాళ్లపై పడ్డాయి. దాంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో ఇంకో గదిలో నిద్రిస్తున్న ఆమె కూతురు సారిక వచ్చి కూలిన పెళ్లలను తొలగించి ప్రథమ చికిత్స అందించారు. బాధితురాలిని కార్పొరేటర్ బొంగు అశోక్ పరామర్శించారు.

బూట్లు, వాటర్ బాటిళ్ల పంపిణీ



ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో సద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో చందుపట్ల మాధవి, దీన్‌దయాళ్ రెడ్డి ఆర్థిక సహకారంతో 85మంది పేద విద్యార్థులకు బూట్లు, వాటర్ బాటిళ్లను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సద్గురు సేవా సమితి అధ్యక్షుడు పసునూరి వజ్రయ్య, హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు మచ్చిక రాజు, హెచ్‌ఎం పిండి ఆనంద్‌బాబు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, మార్గం ఎల్లయ్య, గుండు నాగభూషణం, పరశురాములు, కేదారి, శ్రీధర్, రవి, కృష్ణారెడ్డి, శివాజీ పాల్గొన్నారు.

భారతీయ కళాకార్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శిగా మంజుల



హన్మకొండ చౌరస్తా: భారతీయ కళాకార్ సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా హనుమకొండలోని గోపాల్‌పూర్‌కు చెందిన సాగంటి మంజుల నియమితులయ్యారు. కళాకార్ సంఘ్ ఆధ్వర్యంలో బెంగుళూర్‌లో ఆదివారం నిర్వహించిన ఆర్టిస్ట్ ఫెస్టివల్‌లో మంజులకు సంఘ్ వ్యవస్థాపకుడు అంకూర్, జాతీయ అధ్యక్షుడు కుమార్ ఉత్తర్వులు అందజేశారు.

నవయుగ వైతాళికుడు దాశరథి



హన్మకొండ: పద్య రచన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్



ఆర్ట్స్ కళాశాలలో మాట్లాడుతున్న జ్యోతి



హసన్‌పర్తి: నివాళులర్పిస్తున్న కాలనీవాసులు



విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో దాశరథి జయంతి

హన్మకొండ: నవయుగ వైతాళికుడు దాశరథి అని శ్రీచైతన్య స్కూల్ ఇన్‌చార్జ్ నాగేశ్వర్ రావు అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని శ్రీచైతన్య స్కూల్‌లో దాశరథి జయంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరథి చిత్రపటానికి ప్రిన్సిపాల్ నళిని, ఇన్‌చార్జ్ నాగేశ్వర్ రావు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులకు పద్యరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాసచారి, రవీందర్, నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాశరథిని స్ఫూర్తిగా తీసుకోవాలి

కేయూ క్యాంపస్: తెలంగాణ ధిక్కార కవి దాశరథి కృష్ణమాచార్యులను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి సూచించారు. కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ కర్రె సదాశివ్ అధ్యక్షతన దాశరథి జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాశరథి యాత్రి స్మృతి తెలుగువారికి ఒక మధుర జ్ఞాపకం అని వివరించారు. కేయూ పాలకమండలి సభ్యుడు, తెలుగు విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిర్ర రాజు, అధ్యాపకులు మామిడి లింగయ్య, ప్రవీణ్‌కుమార్, శేషు పాల్గొన్నారు.

ప్రభుత్వ మర్కజీలో దాశరథి జయంతి

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో దాశరథి జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. దాశరథి చిత్రపటానికి హైస్కూల్ హెచ్‌ఎం రామారావు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు భాషా ఉపాధ్యాయుడు వల్సపైడి మాట్లాడుతూ దాశరథి ధైర్యవంతుడైన గొప్ప కవి అని, ఆనాడు నిజాం రాజును తన పద్యాలతో ధిక్కరించాడని కొనియాడారు. గణిత ఉపాధ్యాయుడు కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ గర్వించదగిన గొప్పకవి దాశరథి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యాయులు కె.వాసు, శ్రీనివాస్, పద్మావతి, నర్సయ్య, సమ్మిరెడ్డి, మనోహర్, సరిత, విద్యాసాగర్, స్వామి, లలిత, రమాదేవి పాల్గొన్నారు.

ముచ్చర్లలో..

హసన్‌పర్తి: మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు జయంతి వేడుకలను ఒకటవ డివిజన్ ముచ్చర్లలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీధర్, రాజేష్, కర్ర సాంబశివారెడ్డి, శ్రవణ్, శ్రవణ్, కరుణాకర్, సతీష్, రమణరాజు పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పాలి



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సంఘం బాధ్యులు, దివ్యాంగులు

విద్యారణ్యపురి / హన్మకొండ : దివ్యాంగుల ఆత్మ గౌరవాన్ని కించపరిచిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పాలని దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు బిల్ల మహేందర్ మాట్లాడుతూ ఎంతోమంది దివ్యాంగులు తమ వైకల్యాన్ని జయించి అనేక విజయాలు సాధించారని గుర్తుచేశారు. అలాంటి వాటిని గుర్తించకుండా వారికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయటం శోచనీయమని వాపోయారు. సంఘం రాష్ట్ర, జిల్లా బాధ్యులు నున్న నర్సమ్మ, బోనగిరి రాములు, కుమారస్వామి, మహ్మద్ ఫసియొద్దీన్, వెంకన్న, లింగుదారి రాజేశ్వర్‌రావు, తిరుపతిరావు, చందు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేసు నమోదు చేయాలి

హన్మకొండ: వికలాంగులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై చర్య తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు దేవసూత్ శంకర్ నాయక్, నాయకులు ఇస్లావత్ చందు, దూడల శ్రీనివాస్, కీర్తి రాజు డిమాండ్ చేశారు. 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం కింద కేసు నమోదు చేయాలని వారు ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వ సర్వీస్‌ల్లో వికలాంగులకు రిజర్వేషన్ అవసరం లేదని ఎక్స్ వేదికగా పోస్టు చేయడం ఆమె అవివేకానికి, అవగాహన రాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.

చర్య తీసుకోవాలి

కేయూ క్యాంపస్: అఖిల భారత సర్వీస్‌లకు దివ్యాంగులకు రిజర్వేషన్ అవసరం లేదని అనుచిత వాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల హక్కుల సాధికారిత సంస్థ అధ్యక్షుడు, కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలు రంగాల్లోనూ దివ్యాంగులు కూడా సకలాంగుల కంటే నిజాయితీ, నిబద్ధతతో సేవలు అందిస్తున్నారని తెలిపారు.

నేరాల నియంత్రణలో కీలకపాత్ర పోషించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

వరంగల్: నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల నియంత్రణలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని వరంగల్ షీటీం ఎస్సై కంచి విద్యాసాగర్ సూచించారు. సైబర్ నేరాలు, మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాలపై దేశాయిపేటలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు ఈవ్‌టీజింగ్, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా అమ్మాయిలు సోషల్ మీడియాలో తమ వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని అన్నారు. సైబర్ నేరాలు జరిగితే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఆపద సమయంలో 87126 85257, 87126 85142, 87126 85270 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు చక్రపాణి, నిశాంత్, సమ్మయ్య, జీవన్‌కుమార్, షీటీమ్స్ హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ, కానిస్టేబుల్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి



హన్మకొండ: ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

హన్మకొండ: ఆశ కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల్లో 33 ఏళ్లుగా, మైదాన ప్రాంతాల్లో 19ఏళ్లుగా ఆశ వర్కర్లు పనిచేస్తున్నారని వివరించారు. ఇప్పటి వరకు వారు అనేక శిక్షణలు పొందారని, రిజిస్టర్లు రాయడం, సర్వేలు చేయడం, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయడం, బీపీ, షుగర్, థైరాయిడ్, వివిధ రకాల జబ్బులను గుర్తించడం వంటి విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. ధర్నాలో యూనియన్ నాయకులు రాజేశ్వరి, పద్మ, శోభ, పుతిలి, సరిత, నవమని, రజిత, కె.కల్పన, శోభ, శ్రీవాణి, యాకుబీ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట సెంటర్: ఆశవర్కర్స్ సమస్యలను పరిష్కరించి ఫిక్ వేతనం నెలకు రూ.18 వేలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ) ఆధ్వర్యంలో సోమవారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆశవర్కర్స్ బాధ్యులు వి.వజ్రమ్మ, సీహెచ్.రాణి, జి.రాజేశ్వరి, బి.సునీత, ఎం.పద్మ, సీఐటీయూ నాయకుడు ముక్కెర రామస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆశవర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని కోరారు.

విద్యార్థులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం



ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులు

హన్మకొండ / విద్యారణ్యపురి: విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని అంబేడ్కర్ విద్యార్థి సమాఖ్య హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ ఆరోపించారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని హనుమకొండ, వరంగల్ కలెక్టరేట్లను సోమవారం ముట్టడించారు. పోలీసులు అడ్డుకోవడంతో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు విద్యార్థులు, నిరుద్యోగులకు అండగా ఉంటానని రేవంత్ రెడ్డి హామీ ఇవ్వడంతోనే తామంతా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచామని తెలిపారు. ఏబీఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల నరేష్, ఉపాధ్యక్షుడు దార సురేష్, నాయకులు మచ్చ పవన్ కల్యాణ్, దూడపాక నరేందర్, కిరణ్, హర్షం చరణ్, బండారి పృథ్వీరాజ్, రత్నాకర్, సాయికుమార్, పవన్, పల్లవి, లావణ్య, సుబ్బులు, ప్రవళిక, జోత్స్న, షబీనా, సుమలత, గోపి పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

హసన్‌పర్తి: బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హసన్‌పర్తి మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రహీంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఓబీసీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి పెద్దమ్మ నాగరాజు మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్లతో పాటు గొల్ల కురుమకు గొర్రెలు పంపిణీ చేయాలని సూచించారు. బీసీ సబ్‌ప్లాన్‌తో ఎంబీసీ కులాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారపల్లి రాంచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, రైల్వే బోర్డు సభ్యులు మేకల హరిశంకర్, దాసరి రాజు, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మారం తిరుపతి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, దేవస్థాన మాజీ చైర్మన్ పెద్దమ్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళితుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి



ధర్నా చేస్తున్న డీబీఎఫ్ నాయకులు

హన్మకొండ: దళితులు, గిరిజనుల సమగ్ర అభివృద్ధిపై అసెంబ్లీలో రెండు రోజులు చర్చించాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్)రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు, గిరిజనులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు అంబేడ్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేయాలని, దళిత అభివృద్ధికి ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం 18శాతం నిధులు కేటాయించాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, నాయకులు ప్రసంగి, మోరే అయిలయ్య, సాంబయ్య, రాజు, కిరణ్, ప్రసాద్, రవి, కల్యాణ్ పాల్గొన్నారు.

తాళ్ల పద్మావతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ల్యాబ్



కాజీపేట: ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ మల్లేశం

కాజీపేట: సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ల్యాబ్‌ను తాళ్ల పద్మావతి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ తాళ్ల మల్లేశం సోమవారం ప్రారంభించారు. టాస్క్ మార్గదర్శకత్వంలో sap india code unnati edu net ద్వారా పూర్తిగా స్పాన్సర్ చేసిన ఇరువై లక్షలకు పైగా విలువైన డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలో 16 కళాశాలల్లో ఒకటిగా తాళ్ల పద్మావతి కళాశాలకే ఈ అరుదైన అవకాశం దక్కిందని తెలిపారు. డైరెక్టర్లు డాక్టర్ తాళ్ల వంశీ, చైతన్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వేలు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మి, డీన్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, టాస్క్ రీజినల్ కోఆర్డినేటర్ రామకృష్ణ, పవన్ సాయి, మానిక్ దేవ్, అజిత్‌కుమార్ పాల్గొన్నారు.

ఖిలా వరంగల్: వరంగల్ హంటర్‌రోడ్డులోని తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ల్యాబ్‌ను చైర్మన్ తాళ్ల మల్లేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఇరవై లక్షలకు పైగా విలువైన డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

'చెరువులు కబ్జా కాలేదని రిపోర్టు ఇచ్చిన అధికారులు'

వరంగల్: వరంగల్‌లోని చిన్న వడ్డేపెల్లి చెరువు, బెస్తం చెరువు, కోట చెరువు, రామ సముద్రం చెరువు, కట్ట మల్లన్న చెరువు, శాకరాసికుంట, హసన్‌పర్తిలోని చెన్నంగి చెరువులు కబ్జాకు గురికాలేదని, ఒక రాజకీయ పార్టీ ఆధ్వర్యంలో గుడిసెలు వేశారని లోకాయుక్తకు అధికారులు నివేదిక ఇచ్చారని వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి తెలిపారు. దాంతో వారి చిత్తశుద్ధి ఏంటో అర్థమయిందని అన్నారు. చెరువుల కబ్జాపై హైదరాబాద్‌లో లోకాయుక్త కోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ విచారణకు మున్సిపల్, రెవెన్యూ శాఖ అధికారులు హాజరు కాలేదని పేర్కొన్నారు. ఆరు చెరువుల్లో భవనాలు, రైస్ మిల్లులు, ఫర్నిచర్ షాపులు, డెయిరీ ఫారాలు, రియల్ ఎస్టేట్ ప్లాట్ల కబ్జా విషయాలను అధికారులు గోప్యంగా ఉంచడంపై సత్వరమే విచారణ చేపట్టాలని లోకాయుక్త న్యాయమూర్తిని కోరినట్లు చక్రపాణి తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

రామన్నపేట: వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 19 మందికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ.27,900 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. అలాగే, లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతూ పట్టుబడిన ఒకరికి రూ.500 జరిమానా విధించినట్లు తెలిపారు.

స్లమ్ ఏరియాల్లో ఆహార ప్యాకెట్ల పంపిణీ



ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న కార్పొరేటర్ రజిత

వరంగల్ అర్బన్: నగరంలోని 66వ డివిజన్‌లోని మురికి వాడల్లోని పేదలకు బల్దియా ఆధ్వర్యంలో సుమారు 7వేల ఆహార పొట్లాలను సోమవారం మధ్యాహ్నం పంపిణీ చేశారు. తాజాగా కురుస్తున్న వర్షాలతో పేదలు ఇబ్బందులు పడుతున్నందున ఉన్నతాధికారుల ఆదేశాలతో వెజ్ బిర్యాని ప్యాకెట్‌తోపాటు మజ్జిగను అందజేశారు. ఆయా డివిజన్లలో అధికార కాంగ్రెస్ కార్పొరేటర్ల నేతృత్వంలో పంపిణీ చేయగా, బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్ల ద్వారా కాకుండా కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుల ద్వారా అందజేశారు. దాంతో అధికారుల తీరును బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు తప్పుపడుతున్నారు.

హసన్‌పర్తి: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా 55వ డివిజన్ ముంపు బాధితులకు గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సోమవారం బిర్యాని ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు సంగాల ప్రేమ్‌కుమార్, నాయకులు సారంగపాణి, శానిటరీ జవాన్ రేణుకుంట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఓబీసీ మహాసభను విజయవంతం చేయండి



నయీంనగర్: ఆగస్టు 7న పంజాబ్ అమృత్‌సర్‌లో జరగనున్న 9వ జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో రిజర్వేషన్లు లేకపోవడంతోనే బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడ్డారని పేర్కొన్నారు. దేశ జనాభాలో 60శాతం ఉన్న బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అన్యాయం జరుగుతోందని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు దాడి మల్లయ్య యాదవ్, బచ్చు ఆనందం, టి.సంపత్‌కుమార్, అశోక్‌గౌడ్, రమేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



విద్యారణ్యపురి: రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 1654మంది అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నెలకు రూ.42 వేల వేతనం చెల్లించేలా కృషి చేయాలని అతిథి అధ్యాపకులు కోరారు. ఈమేరకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి హనుమకొండలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పదేళ్లుగా రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా తాము పనిచేస్తున్నామని పేర్కొన్నారు. 7నుంచి 8నెలలకు మాత్రమే పీరియడ్స్ ప్రకారం వేతనాలను చెల్లిస్తున్నారని వాపోయారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చినట్లుగా తమను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అతిథి అధ్యాపకులు దేవేందర్, సునీల్‌కుమార్, చిరంజీవి, శివ, హరిప్రసాద్, సతీష్, హరిబాబు, రాధిక, సబిత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో 2013లో నియమితులైన ఉద్యోగులకు పీఆర్‌సీని వర్తింపచేసి అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కేయూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఈసం నారాయణ, జనరల్ సెక్రటరీ డాక్టర్ పుల్లా శ్రీనివాస్, బాధ్యులు కోరారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాధ్యులు కిరణ్‌కుమార్, బొక్క మొగిలి, ప్రతాప్, దామెర ప్రకాశ్, భూక్య రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు అభినందనలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ విశాల మహేందర్‌కు కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ నేతాజీ, ఉద్యోగులు సోమవారం అభినందనలు తెలిపారు. సూపరింటెండెంట్ ప్రభాకర్, ఉద్యోగులు సదాశివుడు, డాక్టర్ సంగాల ఎఫ్రీమ్‌రాజు, ఆనంద్, శోభారాణి, గౌతమి, మంద శ్యామ్, పున్నంచందర్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థి మృతికి సంతాపం

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీకామ్ తెలుగు మీడియం ఫైనల్ ఇయర్ చదవుతున్న విద్యార్థి భూక్య శివలాల్ అనారోగ్య సమస్యలో ఈనెల 20న రాత్రి మృతి చెందారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి తెలిపారు. ఈమేరకు శివలాల్ మృతికి సోమవారం సంతాపం తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కాజీపేట: ప్రపంచ ఆటో కార్మికుల దినోత్సవ వాల్‌పోస్టర్లను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యువ తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు హింగే శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకుడు సార మహేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరి, లడే అరవింద్, బానోతు వీరు, చందు, యాకుబు పాషా పాల్గొన్నారు.

బీరన్న హుండీ లెక్కింపు

ఖిలా వరంగల్: ఆషాఢ మాసం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని బీరన్న దేవాలయంలో ఏర్పాటు చేసిన హుండీలను ఆలయ కమిటీ అధ్యక్షుడు, కార్పొరేటర్ మరుపల్లి ఆధ్వర్యంలో సోమవారం లెక్కించారు. హుండీలు, అర్చన, అభిషేకాలు, దర్శనాల ద్వారా రూ.25,470 ఆదాయం వచ్చిందని మరుపల్లి రవి వివరించారు. ధర్మకర్తలు కోటేశ్వర్, నీల యాకయ్య, మండల ప్రమీల, కొరె ఐలయ్య, గౌడ కోటేశ్వర్, పూజారి బలభద్ర భాస్కర్ పాల్గొన్నారు.

దేవాలయానికి పంచలోహ విగ్రహం వితరణ

కాశిబుగ్గ: కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులోని సీతారామాంజనేయ సహిత హరిహరపుత్ర అయ్యప్ప, ఓంకారేశ్వర, సుబ్రహ్మణ్య స్వామి దేవాలయానికి 8కిలోల పంచలోహ లక్ష్మీగణపతి విగ్రహాన్ని ముడతనపెల్లి శ్యామ్‌కుమార్, మాలతి దంపతులు ఆదివారం సాయంత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. అనంతరం విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శ్రీకాంతాచారి, కమిటీ సభ్యులు కూచన ఏకాంబ్రం, సదానందం, సుధాకర్ పాల్గొన్నారు.

రిజిస్ట్రార్‌పై విచారణ చేయించాలి

హన్మకొండ : జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవిపై వస్తున్న అవినీతి ఆరోపణలు, అక్రమార్జనపై ఏసీబీ అధికారులతో విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రతి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో తమ అనుచరులతో అక్రమ లావాదేవీలకు, ఏజెంట్ దందాలకు పాల్పడుతున్నారని తెలిపారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

కాశిబుగ్గ: ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి జారిపడి చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మహబూబాబాద్ ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం చోటుచేసుకుంది. వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం 50 – 55 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు వివరాలు వివరాలకు 94415 57232, 87126 58585 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మార్కెట్‌లో పాము కలకలం

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో పాము సంచరించడం కలకలం సృష్టించింది. చుట్టుపక్కల చిత్తడిగా ఉండడంతో పాములు తరచుగా వస్తున్నాయని మార్కెట్ సిబ్బంది తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి



హసన్‌పర్తి: వంగపహాడ్‌లోని ఓ పేకాట కేంద్రంపై పోలీసులు దాడులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేయగా, మరొకరు పరారైనట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు. పేకాట ఆడుతున్న వంగపహాడ్‌కు చెందిన ముస్కు రమేష్, గొర్రె వెంకటేష్, బొల్లెబోయిన మల్లయ్య, గుర్రపు రవీందర్, కొరె కుమారస్వామి, గోనె కేశవ్, బైరగాని పరమేష్, వేముల రాజును అదుపులోకి తీసుకున్నారు. రాజశేఖర్ అనే వ్యక్తి పరారైనట్లు ఇన్‌స్పెక్టర్ సురేష్ చెప్పారు. వారి వద్ద నుంచి రూ.11,680 స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. దాడుల్లో ఎస్సై దేవేందర్‌తో పాటు సిబ్బంది క్రాంతి, మధు, వివేకానందం, రాజశేఖర్ పాల్గొన్నారు.

సీపీని కలిసిన దేవరుప్పుల ఎస్సై

వరంగల్ క్రైం: దేవరుప్పుల పోలీస్‌స్టేషన్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన సృజన్ కుమార్ సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు సీపీకి ఎస్సై మొక్క అందజేశారు.